సాక్షి
నల్లగొండ
శనివారం । 27 । మే । 2023



మత్స్యకారులు విలవిల
మండుటెండలకు నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. - 10లో



హోరాహోరీగా..
సూర్యాపేట జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు శుక్రవారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి. - 12లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41°/29°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాలిసెట్ ఫలితాల్లో బాలికల హవా

- ఎంపీసీలో 81.38, ఎంబైపీసీలో 83.18 శాతం ఉత్తీర్ణత

రామగిరి(నల్లగొండ) : పాలిసెట్ – 2023 ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో బాలుర కంటే బాలికలు అత్యధిక శాతంలో ఉత్తీర్ణత సాధించారు. మే 17న పాలిసెట్ నిర్వహించగా నల్లగొండ జిల్లాలో మొత్తం 4012 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో బాలురు 2,334, బాలికలు 1,678 మంది ఉన్నారు. ఎంపీసీలో బాలురు 1,846 (79.09), బాలికలు 1,419 (84.56) శాతం ఉత్తీర్ణులయ్యారు. ఎంబైపీసీలో బాలురు 1,877 (80.42), బాలికలు 1,460 (87.01) మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా ఎంపీసీలో 81.38 శాతం, ఎంబైపీసీలో 83.18 శాతం ఉత్తీర్ణత సాధించారు.

నల్లగొండ జిల్లా నుంచి స్టేట్ టాపర్స్..
నల్లగొండ జిల్లా నుండి ఎంపీసీ, ఎంబైపీసీ విభాగాల్లో ముగ్గురు చొప్పున స్టేట్ టాపర్స్ ఉన్నారు. ఎంబైపీసీలో కట్టా మిథున శ్రీరెడ్డి 114 మార్కులతో 13వ ర్యాంకు, గడగోటి శ్రేయ 111 మార్కులతో 28వ ర్యాంకు, కరింగు రేణుక 104 మార్కులతో 164వ ర్యాంకు సాధించింది. ఎంపీసీ ఫలితాల్లో మద్దోజు మనీష్ 116 మార్కులతో 21వ ర్యాంకు, కట్టా మిథున శ్రీరెడ్డి 115 మార్కులతో 30వ ర్యాంకు, చింతరెడ్డి కోమల్‌రెడ్డి 111 మార్కులతో 122వ ర్యాంకు సాధించాడు.

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నల్లగొండ టూటౌన్ : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన జిల్లాస్థాయి స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్, రైల్వే, బ్యాంకు, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల శిక్షణ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల వివరాలను tsstudycircle.co.in నందు ఉంచినట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లతో కూడిన ఎంపిక జాబితాను సంబంధిత షెడ్యూల్ కులాల కార్యాలయంలో, స్టడీ సర్కిల్ డైరెక్టర్లకు, అభ్యర్థుల వాట్సప్‌కు, ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

మెప్మా పీడీగా కరుణాకర్ బాధ్యతల స్వీకరణ

నల్లగొండ టూటౌన్ : మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా కరుణాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 15 రోజులుగా పీడీ పోస్ట్ ఖాళీగా ఉండడంతో హైదరాబాద్‌లో పనిచేస్తున్న కరుణాకర్‌ను నల్లగొండ మెప్మా పీడీగా బదిలీ చేయడంతో శుక్రవారం ఆయన విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన పీడీకి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు హాజరు కావాలి

నల్లగొండ టూటౌన్ : సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన క్రీడాకారులకు ఈనెల 28 నుంచి 31 వరకు హైదరాబాద్‌లో జరగనున్న క్రీడా పోటీలకు హాజరు కావాలని జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. క్రీడాకారులు శనివారం ఉదయం 10 గంటలకు నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, రెండు కలర్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

నేడు టీఎస్‌యూటీఎఫ్ ర్యాలీలు

రామగిరి(నల్లగొండ) : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద శనివారం చేపట్టనున్న నిరసన దీక్షకు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీక్షకు మద్దతుగా డివిజన్, జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీల్లో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వెల్వర్తి సర్పంచ్ సస్పెన్షన్

వలిగొండ : మండలంలోని వెల్వర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ పసల అన్నామేరీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేశాడన్న అభియోగంపై సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ గీతారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు సమావేశమై జాయింట్ చెక్ పవర్ కోసం కడవేరు సరోజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీసం నరేందర్ తెలిపారు.

12 స్థానాలు గెలుస్తాం

- బీఆర్ఎస్ హయాంలోనే ఉమ్మడి జిల్లా అభివృద్ధి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- జిల్లా ప్రజలు చైతన్యవంతులు : మంత్రి జగదీశ్‌రెడ్డి
- మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మంత్రుల పర్యటన



మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మంత్రి జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు తదితరులు

మిర్యాలగూడ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ఆయా అభివృద్ధి పనులకు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మిర్యాలగూడలో ఎన్ఎస్పీ క్యాంపు మైదానంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా చరిత్రలో ఇప్పటివరకు ఏ పార్టీ కూడా 12 స్థానాలు గెలవలేదని.. తమ కంచుకోటగా చెప్పుకునే కాంగ్రెస్, టీడీపీ సైతం ఆరు స్థానాల కంటే ఎక్కువగా గెలవలేదన్నారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ
కాంగ్రెస్ నాయకులు తండ్రి, కొడుకులు.. భార్య, భర్త.. అన్నదమ్ముల్లు తలా ఒక నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు జిల్లా అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదన్నారు. నాగార్జునసాగర్ పరిధిలోని రాజవరం మేజర్ కింద పొలాలు ఎండుతుంటే కాంగ్రెస్ నాయకులు పట్టించుకోలేదని తాము రాజవరం లోలెవల్ కెనాల్‌ను పూర్తి చేసి 80 వేల ఎకరాలకు సాగు నీరందించామని వివరించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అయితే, ప్రస్తుతం 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల నడ్డి విరిగిందని.. నేడు దేశానికి అన్నంపెట్టే స్థాయిలో తెలంగాణ రైతులు ఎదిగారని చెప్పారు.

ప్రజలు భయపడరు : మంత్రి జగదీశ్‌రెడ్డి
మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల్లో అహంకారంతో వ్యవహరిస్తున్నారని, జిల్లా ప్రజలు వారి గాండ్రింపులకు భయపడరని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. రూ.40 వేల కోట్లతో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్



నేరేడుచర్లలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

పవర్‌ప్లాంట్‌తో మిర్యాలగూడ, దామరచర్ల ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

రూ4,500 కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే భాస్కర్‌రావు
ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో రూ.200 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించామని, ప్రధాన కూడళ్లను సుందరవనంగా తీర్చిదిద్దామని తెలిపారు. రూ.4.5 కోట్లతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.139 కోట్లతో రైల్వేస్టేషన్ నుంచి ఈదులగూడ వరకు రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సుమారు రూ.3 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ అపూర్వరావు డీఎస్పీలు వెంకటగిరి, నర్సింహారెడ్డితో కలిసి బందోబస్తు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, చిరుమర్తి లింగయ్య, శానంపూడి సైదిరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..
హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అంతకుముందు మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. నేరేడుచర్ల పట్టణ పరిధిలోని రాంపురంలో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. గరిడేపల్లి మండలంలోని పొనుగోడులో పల్లె దవాఖానా పనులకు శంకుస్థాపన చేశారు. రాయినిగూడెంలో పల్లె దవాఖానాను, క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం
వేములపల్లి : మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీవోఏలు తమ సమస్యలను పరిష్కరించాలని, జర్నలిస్టులు తమకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని మంత్రులకు వినతిపత్రాలు అందజేయగా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీఓ దేవిక, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీను, సురేష్, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పు
మిర్యాలగూడ అర్బన్ : తెలంగాణ వచ్చిన తొమ్మిదేళ్లలో వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి ప్రభుత్వ వైద్యాన్ని అందరికీ చేరువ చేశామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చిన్న పిల్లల కోసం పది పడకల ఐసీయూ (ఇన్‌టెన్సివ్ కేర్ యూనిట్)ను ప్రారంభించారు. ఏరియా ఆస్పత్రిని 200 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు అనుగుణంగా రూ.16 కోట్లతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మకాలనీలో రూ.25 లక్షల నిర్మించిన బస్తీద వాఖానాను ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ రమేష్‌కుమార్, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి మాతృనాయక్, ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాస సమరథ్, ఆర్ఎంఓ రాంబాబు పాల్గొన్నారు.

నీలగిరిలో ఐటీ హంగులు

వేగంగా సాగుతున్న ఐటీ హబ్ పనులు

- అమెరికాలో కంపెనీలతో ఐటీ మంత్రి కేటీఆర్ ఒప్పందాలు
- నల్లగొండ ఐటీ హబ్‌తో యువతకు ఉపాధి అవకాశాలు
- సంస్థల ఏర్పాటుకు ముందుకొచ్చిన 15 కంపెనీలు
- మూడు నెలల్లో హబ్ పనులు పూర్తి చేసేలా కార్యాచరణ



నల్లగొండలో నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్స్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ పట్టణంలో ఐటీ హబ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నల్లగొండ ఐటీ హబ్ ద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ నల్లగొండ ఐటీ హబ్‌లో ఆయా సంస్థలను ఏర్పాటు చేసేలా గత వారమే 15 కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. రూ.75 కోట్లతో ప్రారంభించిన హబ్ పనులను మూడు నెలల్లో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకుని అడుగులు ముందుకు వేస్తున్నారు.

15 నెలల్లోనే చివరి దశకు పనులు
రాష్ట్రంలో హైదరాబాద్‌కు పరిమితమైన ఐటీని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించేందుకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపారు. ఇందులో భాగంగానే వివిధ జిల్లాలతోపాటు నల్లగొండ జిల్లా కేంద్రానికి ఐటీ హబ్‌ను మంజూరు చేశారు. 2021 డిసెంబరు 31వ తేదీన ఐటీ హబ్ నిర్మాణ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. 15 నెలల్లోనే ఆరు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఐటీ హబ్‌కు ఓ రూపు తీసుకొచ్చారు. ప్రస్తుతం హబ్‌లో ఇంటీరియర్ పనులు వేగంగా సాగుతున్నాయి.

కనీసం 2 వేల మందికి ఉపాధి
ఈ ఐటీ హబ్ ద్వారా కనీసంగా 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ఐటీ శాఖ చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న జిల్లాకు చెందిన యువతకు ఇక్కడ ఉపాధి కల్పించే లక్ష్యంతో దీన్ని నిర్మిస్తున్నారు. నల్లగొండ ఐటీ హబ్‌లో సంస్థల ఏర్పాటుకు ఇప్పటి వరకు 15 కంపెనీలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈనెల 24వ తేదీన అమెరికా పర్యటనలో ఉన్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో సొనాటా సాఫ్ట్‌వేర్ సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు శ్రీని వీరవెల్లి ఒప్పందం చేసుకున్నారు. దీని ద్వారానే దాదాపు 200 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. త్వరలోనే ప్రారంభమయ్యే ఈ ఐటీ టవర్‌లో సొనాటా సంస్థ తమ కార్యకలాపాలను ప్రారంభించనుందని పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్, ఆరోగ్య రంగం, లైఫ్ సైన్సెస్ రంగాల్లో సేవలందించేందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, ఇన్నోవేషన్స్ కోసం సొనాటా కార్యకలాపాలను నిర్వహించనుంది. దీంతోపాటు మిగతా సంస్థలు కూడా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి టెక్నాలజీ రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించనున్నాయి.

ముందుకొచ్చిన సంస్థలు ఇవే..
స్పాల్ బీ, సీ2ఎస్ టెక్నాలజీ/సంహిత, పీజీకే టెక్నాలజీస్, హెర్మిటేజ్ ఇన్ఫో, ఐటీ అమెరికా, ఇన్ఫో జంక్షన్ ఎల్ఎల్‌సీ, ఎన్ ఫోర్స్, సైటెక్ యూఎస్, న్యూమరిక్ టెక్నాలజీస్, విన్నింగ్ ఎడ్జ్ సొల్యూషన్స్, డిజిక్స్ ఫామ్, కనాక్స్ఏఐ, స్మార్ట్ ఐఎంఎస్, ఏవీ ఎంటర్‌ప్రైజ్.

నల్లగొండ ఐటీ హబ్‌కు పలు సంస్థలు

నల్లగొండ టూటౌన్ : మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న నల్లగొండ ఐటీ హబ్‌కు పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమెరికాలో పర్యటనలో ఉన్న ఐటీ మంత్రి కేటీఆర్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నాయని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కేటీకే బిజినెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ అరుణకుమార్ జక్కి ఎమ్మెల్యే కంచర్లతో తన నివాసంలో సమావేశమయ్యారు. ఐటీ హబ్‌లో తమ సంస్థకు అవకాశం కలిపించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ దేశాల్లో ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఎన్ఆర్ఐలు నల్లగొండ ఐటీ హబ్ నుంచి తమ సంస్థలు నడపడానికి ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. అనంతరం కంపెనీ మేనేజర్ అరుణకుమార్ జక్కితో కలిసి సేవ్ ఆర్గాన్స్, సేవ్ లైఫ్ పోస్టర్లను ఆవిష్కరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

జూన్ 30 వరకు మహా సంపర్క్ అభియాన్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కంకణాల శ్రీధర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో మోదీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయాలన్నారు. రైతు రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాడాలని తీర్మాణం చేశారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ఓరుగంటి రాములు, గోలి మధుసూదన్‌రెడ్డి, పల్లెబోయిన శ్యాంసుందర్, వీరెల్లి చంద్రశేఖర్, కర్నాటి సురేష్, బండారు ప్రసాద్, చనగోని రాములు, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, ఎడ్ల రమేష్ పాల్గొన్నారు.

పెద్ద నోట్ల మార్పిడి

- రూ.రెండువేల నోట్లు మార్చుకునేందుకు బ్యాంకులకు వస్తున్న జనం
- ప్రతి బ్యాంకులో మూడు కౌంటర్లు ఏర్పాటు



బ్యాంకులో నోట్లు మార్చుకుంటున్న ప్రజలు

నల్లగొండ : రూ.2 వేల నోట్లను మార్చుకునేందుకు జిల్లాలోని బ్యాంకులకు జనం తరలి వస్తున్నారు. రూ.2 వేల నోట్లు రద్దు చేసిన ఆర్‌బీఐ ఆ నోట్లు కలిగి ఉన్న వారు ఈ నెల 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు బ్యాంకుల్లో మార్చుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో మంగళవారం నుంచి నోట్ల మార్పిడి ప్రక్రియ సాగుతోంది. ఇందుకోసం బ్యాంకర్లు కూడా ప్రతి బ్యాంకులో మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో సీనియర్ సిటిజన్లకు, మహిళలకు, ఇతర జనాలకు వేరువేరుగా కౌంటర్లు ఉన్నాయి.

ఎంతైనా డిపాజిట్ చేసుకునే అవకాశం
జిల్లాలోని బ్యాంకుల్లో నోట్ల మార్పిడి ప్రారంభమైంది. కొందరు రూ.2 వేల నోట్లను బ్యాంకుల్లో తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకుంటుండగా మరి కొందరు రూ.20 వేల వరకు మార్చుకుంటున్నారు. అయితే రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్నా.. అకౌంట్లలో జమ చేసుకునేందుకు అవకాశం ఉంది. అయితే రూ.50 వేల కంటే ఎక్కువ జమ చేయాలంటే పాన్ కార్డ్ తప్పని సరి అని బ్యాంకర్లు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో చెలామణికాని నోట్లు..
ఆర్‌బీఐ రూ.2 నోట్లను రద్దు చేసినట్లు ప్రకటించడంతో ప్రస్తుతం బయట మార్కెట్‌లో ఎవరూ రూ.రెండువేల నోట్లను తీసుకోవడం లేదు. ఆర్‌బీఐ సెప్టెంబర్ 30 వరకు రెండువేల నోటు చెలామణిలో ఉంటుందని ప్రకటించినా.. వ్యాపారులు వాటిని పెద్దగా తీసుకోవడం లేదు.

డిపాజిట్ చేసుకున్న



నా వద్ద రూ.2 వేల నోట్లు 20 ఉంటే వాటిని బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేసుకున్నా. రోజుకు రూ.20 వేల చొప్పున మాత్రమే మార్చుకునేందుకు ఆర్‌బీఐ అవకాశం ఇచ్చింది. ఎక్కువ నోట్లు ఉంటే డిపాజిట్ చేసుకోవచ్చు. అందుకే నేను నా బ్యాంకు ఖాతాలో జమ చేసుకున్నా.
– గోపినాథ్, నల్లగొండ

గొర్రెల పంపిణీకి సమాయత్తం



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ యాదగిరి



శిక్షణకు హాజరైన అధికారులు

- మొబైల్ యాప్‌పై జిల్లా అధికారులకు శిక్షణ

నల్లగొండ : జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలలో గొర్రెల పంపిణీని ప్రారంభించనున్నందున గొర్రెల పంపిణీ, సేకరణకు నియమించిన జిల్లా అధికారులకు పశు సంవర్ధక శాఖ జేడీ యాదగిరి శుక్రవారం కలెక్టరేట్‌లో టెక్నికల్ అంశాలపై మొబైల్ యాప్‌లో కొనుగోలు, వివరాలు నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత జిల్లాలో 28,234 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారని, రెండో విడత కోసం 37,078 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. లబ్ధిదారులు తమ వాటా కింద వారి వర్చువల్ అకౌంట్ ద్వారా రూ.43,750 కలెక్టర్ అకౌంట్‌కు చెల్లించగానే గొర్రెలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 6,600 మంది లబ్ధిదారులు రూ.43,750 తమ వాటా కింద చెల్లించారని చెప్పారు. గొర్రెల కొనుగోలు కోసం నల్లగొండ జిల్లాకు కేటాయించిన అనంతపురం, కడప జిల్లాలకు అధికారులు లబ్ధిదారులతో కలిసి వెళ్లి కొనుగోలు చేస్తారని తెలిపారు. కొనుగోలు చేసేప్పుడు మొబైల్ యాప్‌లో కొనుగోలు వివరాలు ఏ విధంగా నమోదు చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

నల్లగొండ క్రైం : బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ అపూర్వరావు శుక్రవారం హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న 20 మంది బాల కార్మికులను యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసు బృందం గుర్తించినట్లు పేర్కొన్నారు. నల్లగొండరూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్నెపర్తిలో పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తున్న ఇటుకబట్టీ యజమాని చల్లా నర్సింహపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 20 మంది బాల కార్మికులను ఇటుకబట్టీలో పని చేయించినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని, ఎవరైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెట్టి చాకిరి చేయిస్తున్న వారి సమాచారాన్ని చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కి, ఉమెన్ హెల్ప్‌లైన్ 181కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ టీం ఇన్‌చార్జి ఎస్ఐ గోపాల్‌రావు, హెచ్‌సీ నర్సింహ, నజీర్, సాయి, సందీప్, లింగయ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజును ఎస్పీ అభినందించారు.

తిరుమలగిరి బంద్ ప్రశాంతం



బంద్‌తో బోసిబోయిన తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తా

తిరుమలగిరి (తుంగతుర్తి): తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం తిరుమలగిరి పట్టణంలో అఖిలపక్ష నాయకుల చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. అఖిలపక్ష నాయకులు ఉదయమే బైక్‌లపై ర్యాలీ నిర్వహించి వ్యాపార, వాణిజ్య సముదాయాలు మూసి వేయాలని కోరారు. దీంతో వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మధ్యాహ్నం వరకు మూసివేసి అనంతరం తెరిచారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకొని అక్కడ ఉన్న అఖిలపక్ష నాయకులను అరెస్ట్ చేసి సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), నూతనకల్, తుంగతుర్తి, అర్వపల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో కందుకూరి సోమయ్య, కడియం రామచంద్రయ్య, వై.ధీన్‌దయాళ్, పందుల శ్రవణ్‌కుమార్, బొడ్డు కిరణ్, వై.నరేష్, జమ్మిలాల్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాలికపై అత్యాచారయత్నం

పెద్దవూర : బాలికపై ఓ బాలుడు అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దవూర మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఓ తండాకు చెందిన బాలికను అదే మండలం మరో తండాకు చెందిన బాలునికి కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని సదరు బాలుడు మాయమాటలతో బాలికను శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి సదరు బాలిక ఇంటికి రావడంతో ఆ బాలిక గట్టిగా కేకలు వేసింది. కుటుంబ సభ్యులు మేల్కొనడంతో బాలుడు పరారుకాగా ఈ విషయ వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు బాలుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం నల్లగొండ ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు.

యాదాద్రి ఘాట్‌రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే దారిలోని మొదటి ఘాట్ రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షమైంది. స్థానిక భక్తులు, ఎస్పీఎఫ్, హోంగార్డు సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో మొదటి ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వెళ్లే మార్గంలో ఉన్న జీయర్ కుటీర్ సమీపంలోని ప్రధాన రహదారిపైకి నాగుపాము వచ్చింది. గమనించిన భక్తులు, పోలీస్ సిబ్బంది భయాందోళన చెందారు. ఆ సమయంలోనే ఓ వాహనం అటువైపు వెళ్తుంటే పాము ఒక్కసారిగా పడగ విప్పి కూర్చుంది. సుమారు 30నిమిషాల పాటు అలాగే ఉంది. స్వామివారే సర్పరూపంలో ఆలయ పరిసరాలు, ఘాట్ దారిలో తిరుగుతూ అప్పుడప్పుడు కనిపిస్తారని స్థానిక భక్తులు పేర్కొంటున్నారు. సుమారు అర్ధగంట తర్వాత నాగుపాము పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లింది.

ఎండలకు మత్స్యకారులు విలవిల

- వలకు చేపలు చిక్కక పూట గడవని స్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

నాగార్జునసాగర్: మండుటెండలకు నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. వలకు చేపలు చిక్కక పస్తులుండే పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. భానుడి ప్రతాపానికి జలాశయంలోని నీరు విపరీతంగా వేడెక్కుతుండడంతో చేపలు నీటి పైకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర పడవలలో పుట్టీలను వేసుకొని జలాశయం లోపలికి వెళ్లి చేపలు పట్టే పరిస్థితి నెలకొందని మత్స్యకారులు అంటున్నారు. గతంలో పుట్టీల్లోనే జలాశయంలోకి వెళ్లేవారమని నేడు ఆ పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. జలాశయం తీరం వెంట సుమారు 10వేల మత్స్యకారుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిలో డ్యాం నిర్మాణ సమయంలో ఇక్కడికి వచ్చి స్థిరపడిన కుటుంబాలే ఎక్కువ. వీరితో పాటు జలాశయ తీరం వెంట స్థానికంగా ఉన్న గ్రామాలు, తండాలవాసులు బతుకుదెరువు కోసం మత్స్యకారులుగా మారారు. ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో చేపలు నీళ్ల లోపలే ఉంటున్నాయని పైకి రాకపోవడంతో వలకు చిక్కడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఉదయం 10గంటల నుంచే ఎండ వేడిమి పెరుగుతుండటంతో తీరం వెంట పుట్టీల కిందనే ఉంటున్నామని తెలిపారు. చేపలు పట్టి అమ్ముకునే తమకు విక్రయించడానికి చేపలు లేక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు తగ్గితే తప్ప జలాశయంలోకి వెళ్లలేమని, వడగాల్పులకు పుట్టీల కింద కూడా ఉండలేకపోతున్నామని మత్స్యకారులు అంటున్నారు. మత్స్యకారులను ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకార సంఘాలు కోరుతున్నాయి.



జలాశయ తీరంలో వదిలి వెళ్లిన మరపడవలు

బియ్యం, నగదు అందజేయాలి



మత్స్యకారుల కుటుంబాలకు వేసవిలో చేపలు దొరకడం కష్టంగా మారింది. వేసవిలో పొట్టపోసుకోవడానికి ప్రభుత్వం అదనపు బియ్యం ఇవ్వాలి. రోజువారి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.3వేలు ఇవ్వాలి.

– కోదండం, మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు



సాగర్ జలాశయం తీరంలో పుట్టీల కింద ఉన్న మత్స్యకారులు



చేపలు పట్టేందుకు తెప్పపై నదిలోకి వెళ్తున్న మత్స్యకారులు



నదిలో వల విసురుతున్న మత్స్యకారులు

కడుపునొప్పి భరించలేక..

- వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం



సిద్దులు (ఫైల్)

రాజాపేట : కడుపునొప్పి భరించలేక వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కోదాడ, రాజాపేట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలంలోని సోమారం గ్రామానికి చెందిన తమ్మడి శ్రీనివాసులు, పద్మల పెద్దకుమారుడు సిద్దులు (26) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కూడా సిద్దులుకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అనంతరం విషయాన్ని తమ్ముడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి భువనగిరి ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని..

కోదాడరూరల్ : అనంతగిరి మండలం బొజ్జగూడెం గ్రామానికి చెందిన భుక్య బంద్యా(70) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతని భార్య ఆరోగ్యం కూడా బాగోలేదు. కుటుంబ సమస్యలు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అతను పనిచేస్తున్న కోదాడ పట్టణంలోని పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే దుకాణంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పక్కన పండ్ల వ్యాపారం చేసే వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హరీశ్‌రావుకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

మిర్యాలగూడ అర్బన్: పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం మిర్యాలగూడకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఆరోగ్యశ్రీ సిబ్బంది (ఆరోగ్యమిత్ర)లు వినతిపత్రం అందచేశారు. కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వడంతో పాటు టీఏ, డీఏ కల్పించాలని, ఆరుగంటల పనిదినాన్ని అమలు చేసి, ఆస్పత్రులకు వచ్చే డబ్బులలో ఆరోగ్యమిత్రలకు ప్రోత్సాహక పర్సంటేజీలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డుల సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

హత్య కేసులో ముగ్గురిపై కేసు

గుర్రంపోడు : మండంలోని కొప్పోలులో గురువారం జరిగిన యువకుడు బొడ్డు సంతోష్ హత్య కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. దాడికి పాల్పడిన బాలిక తండ్రి ఆవుల మల్లయ్య, నాయినమ్మ రాములమ్మ, బంధువు ఆవుల నగేష్‌లపై మృతుడి బాబాయి వనం నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా, కట్టంగూర్ మండలం దుగినెల్లి గ్రామానికి చెందిన సంతోష్ తల్లిదండ్రులు సైదులు రేణుకలు శుక్రవారం ఉదయం సూరత్ నుంచి నల్లగొండ ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు స్వగ్రామానికి వెళ్లిపోయారు. పూర్తి స్థాయిలో బంధువులు రాకపోవడంతో అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

సంస్థాన్ నారాయణపురం : తాటి చెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సంస్థాన్‌నారాయణపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు నీళ్ల నర్సింహ(70) రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లు తీసే ప్రయత్నంలో ప్రమాదశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి అయినా నర్సింహ ఇంటికి రాకపోవడంతో తాటివనాల్లో వెతకగా అప్పటికే మృతిచెందాడు.

రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన చికెన్ పట్టివేత

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని హ్యాండ్లూమ్‌మార్కెట్‌లోని గ్రీన్‌బకెట్ రెస్టారెంట్‌లో శుక్రవారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వినియోగానికి వంటగదిలో ఉంచిన కుళ్లిపోయిన చికెన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా పాడైపోయిన చికెన్‌ను పక్కనే ఉన్న డ్రెయినేజీలో సైతం కలుపుతున్నట్టుగా గుర్తించారు.రెస్టారెంట్ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్ ఉన్నారు.

దుకాణంలో చోరీ

మాడుగులపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు కిరాణ దుకాణం పైకప్పు సిమెంటు రేకులు ధ్వంసం చేసి అందులోని నగదు, సామగ్రి అపహరించారు. మండలంలోని కుక్కడం గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుక్కడం గ్రామానికి సయ్యద్ జాని తౌడు మిల్లు సమీపంలో కిరాణ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా గురువారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వచ్చి దుకాణం తెరువగా పైకప్పు రేకులు పగలి ఉన్నాయి. కౌంటర్‌లో రూ. 5 వేల నగదు, 5 వేల విలువైన సామగ్రి కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గాయపడిన యువకుడు మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ నెల 24న ఆలేరు వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం రాయగిరి సమీపంలో రెండు దిచక్రవాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న జావిద్, యాసిన్, కేతన్, గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కేతన్ (21)శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

- కలెక్టర్.. రాక్ క్లైంబింగ్



యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి భువనగిరి ఖిలాపై రాక్ క్లైంబింగ్ చేశారు. ఇటీవల తన కుమారుడుతో కలిసి ఖిలా వద్దకు వెళ్లారు. కుమారుడు జిప్‌లైన్ చేయగా కలెక్టర్ రాక్ క్లైంబింగ్ చేశారు. ఆ ఫొటోలు కలెక్టర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. అవి శుక్రవారం బయటకు వచ్చి వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టాయి.

– భువనగిరి

మంత్రుల పర్యటనలో కార్యకర్తకు గాయాలు

- బీఆర్ఎస్ కార్యకర్త కాలుపైకి ఎక్కిన దేవరకొండ ఎమ్మెల్యే కారు

మిర్యాలగూడ అర్బన్ : మంత్రుల పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మంత్రులు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో కాన్వాయ్‌లోని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రనాయక్ కారు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిట్యాల సైదయ్య కాలుపైకి ఎక్కింది. వెంటనే గట్టిగా అరవడంతో కారును ఆపిన డ్రైవర్ వెనకకు తీశాడు. కాలికి గాయం కావడంతో తోటి కార్యకర్తలు వెంటనే ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగినా ఎమ్మెల్యే కారు దిగకుండా వెళ్లిపోవడంపై అక్కడున్న కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.



గాయపడిన కార్యకర్తను ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్న తోటి కార్యకర్తలు

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

చివ్వెంల (సూర్యాపేట) : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం హట్యాతండాకు చెందిన సరోజకు పెన్‌పహాడ్ మండలం జల్మాల్‌కుంట తండాకు చెందిన నునావత్ స్వామితో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2020 సంవత్సరంలో ఏప్రిల్ నెలలో స్వామి తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ తండ్రి నునావత్ బీక్యాను హత్య చేశాడు. అనంతరం మూడు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి అదే సంవత్సరం ఆగస్టులో రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి చేసి కడతేర్చాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేశారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి అడిషినల్ పీపీ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు సహకరించారు.

ట్రాక్టర్ కిందపడి విద్యార్థి మృతి



జీవన్ (ఫైల్)

నల్లగొండ క్రైం : ట్రాక్టర్ కిందపడి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన నల్లగొండ మండలం దోమలపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దొమలపల్లి గ్రామానికి చెందిన నర్సింహ కుమారుడు జీవన్ అలియాస్ మల్లికార్జున్ (15) 8వ తరగతి పూర్తి చేశాడు. వేసవి సెలవుల్లో తండ్రికి వ్యవసాయం చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. మధ్యాహ్నం జీవన్ వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. తండ్రి భోజనానికి ఇంటికి వెళ్లగా జీవన్ ట్రాక్టర్‌తో భూమిని దున్నుతున్నాడు. ఈ క్రమంలో భూమి ఎగుడుదిగుడుగా ఉండడంతో ట్రాక్టర్ అదుపుతప్పింది. ఈ క్రమంలో జీవన్ ట్రాక్టర్ పైనుంచి కిందికి దూకబోగా అతడి కాలు బ్రేక్ మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో తలకిందులుగా వేలాడుతున్న జీవన్ పైనుంచి ట్రాక్టర్ వెనుకటైరు ఎక్కింది. దీంతో అతడు గాయపడడంతో పాటు ఊపిరి ఆడక మృతిచెందాడు. సమీప రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

మూగజీవి యాతన

- గుర్తుతెలియని వాహనం ఢీకొని సూడిగేదెకు గాయాలు
- నడవలేని స్థితిలో అవస్థ
- వైద్యం చేయించి, సపర్యలు చేస్తూ కాపాడుతున్న హోటల్ యజమాని

నిడమనూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ సూడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. లేవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గేదె దీనస్థితిని చూసి ఓ హోటల్ యజమాని దానికి చికిత్స చేయించి సంరక్షిస్తున్నాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గేదె పరిస్థితిని చూసి అయ్యో పాపం అంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నార్లగూడ మేజర్ సమీపంలో ఇటీవల గుర్తుతెలియని వాహనం గేదెను ఢీకొట్టి వెళ్లిపోయింది. మరుసటి రోజు సమీపంలోని ఓ హోటల్ యజమాని నరేంద్ర గమనించాడు. గేదె పడుతున్న అవస్థ చూసి రోడ్డు పక్కన చెట్టు నీడకు జరిపించాడు. బంకాపురం గోపాలమిత్ర నాగయ్యను రప్పించి వైద్య సేవలు అందిస్తున్నాడు. గడ్డి వేసి, నీళ్లు పెట్టి ఎండ తగలకుండా చర్యలు తీసుకుంటూ ఆ మూగజీవిని కాపాడుతున్నాడు.



నార్లగూడెం వద్ద చెట్టుకింద సేదదీరుతున్న గేదె

- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



మిర్యాలగూడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు



వేములపల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి , ఎంపీ, ఎమ్మెల్యేలు



మట్టపల్లి ఆలయంలో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి



మిర్యాలగూడలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి



మిర్యాలగూడలో పీడీయాట్రిక్ వార్డు ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే



మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



సత్తయ్య (ఫైల్)

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీర్నేముల గ్రామానికి చెందిన కడారి సత్తయ్య (65) రామన్నపేట శివారులో ఏడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి కాలం కలిసి రాక దిగుబడులు తగ్గి కౌలు కోసం, పెట్టుబడి నిమిత్తం చేసిన అప్పులు తీరలేదు. కొద్దిరోజులుగా అప్పులు తీర్చేదెట్లా అని దిగులు చెందుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెందిన సత్తయ్య ఈనెల 25న మధ్యాహ్నం కౌలు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి మడికట్లలో ఉన్న చెత్తను తగులబెట్టి ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.